క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజనీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ శివాలయం, సిరినగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10గంటల నుంచి 11.30వరకు, 11కేవీ జైపురికాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం11 నుంచి మధ్యాహ్నం 1.30వరకు, 11కేవీ విజయపురి కాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని రామకృష్ణ కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి బాసగూడతండాకు చెందిన సరోజబాయ్ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ కింద దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మంజూరైన రూ.30 వేల చెక్కును శుక్రవారం కౌన్సిలర్ లబ్ధిదారు కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పహాడీషరీఫ్: నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టామని మహేశ్వరం డివిజన్ ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి అన్నారు. సీఐ గురువారెడ్డితో కలిసి ఠాణా పరిధిలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర శివారులో ఉన్న డివిజన్ పరిధిలో ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా చోరీలకు తావులేకుండా రౌండ్ ది క్లాక్ పెట్రోలింగ్‌ను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇతర ప్రాంతాల నుంచి చోరీ చేసిన వాహనాలతో వచ్చే నేరస్థులను గుర్తించేందుకు తనిఖీలు చేపట్టామని తెలిపారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

కేఎల్‌ఆర్‌కు గ్రామస్తుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధి మంఖాల్ నుంచి హర్షగూడ గ్రామం వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని హర్షగూడ గ్రామస్తులు కోరారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు సమస్య పట్ల కేఎల్‌ఆర్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. త్వరలో రోడ్డు పనులు ప్రారంభించి, పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు రవినాయక్, రాజునాయక్, పెండాల కుమార్, సరోజ, నవీన్, అజయ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌ను అభినందిస్తున్న జైత్వారం వాసులు

కందుకూరు: మండల పరిధిలోని జైత్వారం నుంచి గఫూర్‌నగర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4.50 కోట్ల నిధులు మంజూరుపై జైత్వారం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో తమ సమస్య పరిష్కారం కావడం సంతోషించదగ్గ విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఓర్సు వెంకటేష్, ఉపాధ్యక్షుడు మేళ్ల శ్రీను, చల్లా జైపాల్‌రెడ్డి, జంగని దర్శన్, సంగం మహేందర్, జంగని బాబు, చల్లా కృష్ణారెడ్డి, సంగం రాంచంద్రి, ప్రొద్దుటూరు భోజిరెడ్డి, పసుపుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రైతు 'బేజార్'!



శిథిలావస్థలు మార్కెట్ మడిగలు

డంపింగ్ యార్డును తలపిస్తున్న మార్కెట్
- వినియోగంలేక శిథిలావస్థకు..
- సమీకృత వాణిజ్య సముదాయం మరచిన పాలకులు
- శంకుస్థాపన చేసి రెండేళ్లు గడిచినా.. చర్యలు శూన్యం

మీర్‌పేట: కొత్తగా వాణిజ్య సముదాయం అన్నారు. అందుకు తగిన నిధులు కేటాయించారు. నిర్మాణ పనులకు నాటి ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా శంకుస్థాపన సైతం చేశారు. కానీ శంకుస్థాపన చేసి మూడేళ్లు కావస్తున్నా.. రైతుబజార్ పునరుద్ధరణ పనులకు ముహూర్తం ఖరారు కావడం లేదు. పైగా కొత్తవింత పాతరోతగా వినియోగం లేక రైతుబజార్ మండిగలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చెత్తకుప్పలు పేరుకుపోయి డంపింగ్ యార్డులా మారింది.

స్థల సేకరణ కారణంగానే..

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్ రైతుబజార్‌ను గతంలో 40 మడిగలు కేటాయిస్తూ భారీ షెడ్డును నిర్మించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబజార్‌ను పునరుద్ధరించి సమీకృత వాణిజ్య సముదాయం (వెజ్/నాన్‌వెజ్ మార్కెట్)గా నిర్మించేందుకు గాను రూ.4.50 కోట్ల నిధులు కేటాయించారు. 2022 జనవరిలో నాటి మంత్రులు సబితారెడ్డి, కేటీఆర్‌లు శంకుస్థాపన చేశారు. కానీ నేటి వరకు వాణిజ్య సముదాయం గురించి పట్టించుకున్న వారే లేరు. దీనికి కారణం



మార్కెట్ ఆవరణలో చెత్త డంప్

స్థల సేకరణ కొలిక్కి రాకపోవడం వలనే జాప్యం జరుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

శిథిలావస్థకు

కొత్తగా వాణిజ్య సముదాయం సంగతి ఎలా ఉన్నా.. పూర్వ మార్కెట్ మడిగలను మార్కెటింగ్ శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ పట్టించుకోకపోవడంతో అవి శిథిలావస్థకు చేరాయి. వినియోగంలేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారిందని ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో కూరగాయలు విక్రయించిన వ్యాపారులు.. గత్యంతరం లేక రోడ్డుపైనే క్రయవిక్రయాలు జరుపుతున్నారు.

డంపింగ్ యార్డుగా..

కొత్తగా వాణిజ్య సముదాయం సంగతి ఎలా ఉన్నా.. ఉన్న రైతు బజార్‌ను సంబంధిత అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీంతో మార్కెట్ కాస్త.. డంపింగ్ యార్డుగా మారింది. కాలనీల్లో సేకరించిన చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది డంపింగ్‌కు తరలించకుండా మార్కెట్ ఆవరణలో కుప్పగా పోస్తుండటంతో గుట్టలుగా పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన వస్తోందని ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. శానిటేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. మార్కెట్ కాస్త.. డంపింగ్ కేంద్రంగా మారిపోతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ముందుగా మార్కెట్‌లో చెత్తను తొలగించాలని, తరువాత సమీకృత వాణిజ్య సముదాయం పనులను ప్రారంభించేలా అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు వేశారు.. బ్రిడ్జి మరిచారు!

- ఇబ్బందుల్లో పాటిగడ్డ గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



వాగు దాటుతున్న వాహనదారుడు (ఫైల్)

కేశంపేట: అధికారుల నిర్లక్ష్యమో... లేక పాలకుల అలసత్వమో గానీ బీటీ రోడ్డు వేసి వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు చేయకపోవడంతో వాహనదారులకు, పాదచారులకు తిప్పలు తప్పడం లేదు. మండల పరిధిలోని అల్వాల రోడ్డు నుంచి చౌలపల్లి గ్రామ రోడ్డు వరకు గత ప్రభుత్వం బీటీ రోడ్డును పాటిగడ్డ గ్రామం మీదుగా నిర్మించింది. పాటిగడ్డ గ్రామ శివారులో వాగు ఉండటంతో అక్కడ బ్రిడ్జి నిర్మాణం చేయలేదు. రోడ్డు ఉన్నప్పటికీ వానాకాలంలో వర్షాలు కురిస్తే గ్రామం నుంచి కొత్తపేట వైపు వెళ్లడనికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పాటిగడ్డ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు అధికంగా కురిస్తే వాగు ఉధృతంగా ప్రవాహిస్తుందని చెబుతున్నారు. దీంతో రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వాగు ప్రవాహం ఎక్కువైనప్పుడు వాహనదారులు, ప్రజలు అల్వాల గ్రామం నుంచి వెళ్లాల్సి వస్తుందని వారు తెలిపారు. అధికారులు బీటీ రోడ్డు నిర్మించి, బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వాగుపైన బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



కూలీలతో మాట్లాడుతున్న శ్రీను

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను

షాద్‌నగర్ రూరల్: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని భవన నిర్మాణ కార్మికుల అడ్డావద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు కనీస మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. లేబర్ అడ్డా వద్ద తాగేందుకు మంచినీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో కార్మికులకు కష్టాలు తప్పడంలేదన్నారు. అడ్డాపై గంటల తరబడి నిలబడి పని కోసం ఎదురుచూపులు చూసే కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కూలీలకు పని దొరకని రోజు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ అడ్డావద్ద కూలీలకు రూ.5లకే భోజన వసతి కల్పించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్, సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు గడ్డం జంగయ్య, కార్యదర్శి లింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



చిలుకూరు ఆరోగ్య ఉపకేంద్రం వద్ద ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

మొయినాబాద్: చిలుకూరులో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనం ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. దీంతో 'నిర్మించారు.. వదిలేశారు' అనే శీర్షికతో గురువారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. ఆయుర్వేదిక్ డాక్టర్ సాయిబాబా, సీహెచ్‌ఓ వెంకటరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ శోభారాణి శుక్రవారం ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ వెంకట్‌రెడ్డితో మాట్లాడి పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి వెంటనే ప్రారంభోత్సవం చేసేందుకు సిద్ధం చేయాలని సూచించారు. ప్రహరీ నిర్మాణం పూర్తి కాగానే కరెంటు కనెక్షన్ సైతం ఏర్పాటు చేసి వీలైనంత త్వరలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని వైద్యాధికారులు తెలిపారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ఏబీవీపీ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న మహిపాల్

చేవెళ్ల: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి కుర్వ మహిపాల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏబీవీపీ నగర కార్యదర్శి మహిపాల్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్ నిధులు రూ.7,500 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయన్నారు. సంవత్సరం గడిచినా ఈ ప్రభుత్వం కూడా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు ఈ పెండింగ్ బకాయిలు శాపంగా మారిందన్నారు. డిగ్రీ, పీజీ పూర్తయినటువంటి విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా యాజమాన్యాలు ఒత్తిడికి గురి చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. ఈ సమావేశంలో కిషోర్, విజయ్, ప్రశాంత్, శివకుమార్, అఖిల, ప్రవళిక సంధ్య, పావని, భాను, తదితరులు పాల్గొన్నారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి

పశువైద్యాధికారి దివ్యారెడ్డి



షాబాద్: గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

మొయినాబాద్ రూరల్: పశువుల పెంపకంలో రైతులు, పెంపకదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని అమ్డాపూర్ పశువైద్యాధికారి దివ్యారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్, అజీజ్‌నగర్ ఆయా గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించుకోవాలన్నారు. పశువు కాపరులు, రైతులు అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. పశువులు అనారోగ్యాలకు గురైతే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, పాడి పశువుల కాపరులు, నర్సింహ్మాచారి, కుమ్మరి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికార్లు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మద్దూరు, మన్మయ్యతండా, షాబాద్, సర్దార్‌నగర్ గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పశువుల ఆరోగ్యం పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



బోనాలతో మహిళలు, గ్రామస్తులు తదితరులు

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలో గ్రామస్తులు గ్రామ దేవతల విగ్రహాల పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎల్లమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని పెద్ద ఎత్తున ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, బాల్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, పెంటయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కుల పేర్లను తొలగించండి

బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్

షాబాద్: తాళ్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అక్రమార్కుల పేర్లు తొలగించి, అసలైన రైతులకు న్యాయం చేయాలని బీజేపీ షాబాద్ మండల అధ్యక్షుడు అంబడి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తాళ్లపల్లి రెవెన్యూలో సర్వేనెంబర్ 483లో రికార్డు ప్రకారం ఉండవలసిన ప్రభుత్వ భూమి 153 ఎకరాల 4గుంటలకు గాను ప్రస్తుత రికార్డు ప్రకారం 233 ఎకరాల 29 గుంటలకు పెరిగిందన్నారు. ఈ సర్వేనెంబర్‌లో నిజమైన రైతులను గుర్తించి, అక్రమంగా రికార్డులో ఎక్కించుకున్న పేర్లను తొలగించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్, రాజీవ్‌రెడ్డి, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం..

తల్లీబిడ్డ క్షేమం

కడ్తాల్: మండల పరిధి ముద్విన్ గ్రామానికి చెందిన శ్రీశైలం భార్య లావణ్యకు శుక్రవారం ఉదయం ఆరుగంటలకు పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో కుటుంబీకులు 108లో ఆమెను కాన్పుకోసం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. అప్రమత్తమైన 108 సిబ్బంది, సదరు గర్భిణికి సాధారణ కాన్పు చేయగా.. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వారిని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. సకాలంలో సిబ్బంది స్పందించడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ కల్యాణ్, పైలట్ శ్రీనివాస్‌రెడ్డిలను అభినందించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మాడ్గుల: అభివృద్ధి పనుల కోసం రూ.7.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎంపీ మల్లురవి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండల్‌రెడ్డి, యాదయ్య, మాజీ ఉపాసర్పంచ్ రాములు, జంగయ్యగౌడ్, శరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

కేతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ వాణీకృష్ణారెడ్డి

మొయినాబాద్ రూరల్: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, కేతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ మోత్కుపల్లి వాణీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కేతిరెడ్డిపల్లి గ్రామంలో అయ్యప్ప స్వాములు ఇరుముళ్లకట్టుకుని శబరిమలకు పాదయాత్రగా వెళ్లారు. అయ్యప్ప మహాపడి పూజ అనంతరం మోత్కుపల్లి వాణీకృష్ణారెడ్డి అన్నదానం చేశారు. ఈ పూజలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దారెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సిద్ధయ్య, అంజనేయులుముదిరాజ్, దారెడ్డి కృష్ణారెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించాలి

మంచాల: పత్తి సాగులో రైతులు మెలుకువలు తప్పనిసరిగా నేర్చుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త ఎ.అమృత అన్నారు. కృషి విజ్ఞాన్ కేంద్ర పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధి చిత్తాపూర్‌లో ఆమె పత్తి పంటను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే విధంగా సాగులో రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కూలీల ఇబ్బంది లేకుండా ఆధునిక పద్ధతిలో సాగు చేసి లాభాలు పొందాలని పేర్కొన్నారు. డాక్టర్ సుదీర్, డాక్టర్ దిలీప్, కృష్ణ, హరికృష్ణ, మాజీ సర్పంచ్ నాగరాజ్ గౌడ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

షాద్‌నగర్ రూరల్: మున్సిపల్ కార్మికులు తప్పనిసరిగా ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు కంటి పరీక్షలతో పాటు క్షయవ్యాధికి సంబంధించిన వైద్యపరీక్షలు నిర్వహించారు.

మాతాశిశు మరణాలను అరికట్టాలి

ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పూనమ్



మాట్లాడుతున్న డాక్టర్ పూనమ్

మొయినాబాద్: మాతా శిశు మరణాలను అరికట్టాలని ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పూనమ్ పేర్కొన్నారు. మొయినాబాద్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే విధంగా ప్రోత్సహించాలని ప్రసవం తరువాత ఎదురయ్యే సమస్యలను వివరించాలన్నారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో మండల వైద్యాధికారి అన్నపూర్ణ, సీహెచ్‌ఓ వెంకట్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలి

ఫీల్డ్ ఆఫీసర్ లింగంగౌడ్, బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము



లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న లింగంగౌడ్, రాము

షాబాద్: అర్హులైన లబ్ధిదారులు జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలని షాబాద్ ఎస్‌బీఐ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ఆత్మ లింగంగౌడ్, బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము పేర్కొన్నారు. శుక్రవారం ఎస్‌బీఐ బ్యాంకు వద్ద జీవిత బీమా చేసుకున్న లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రధాన మంత్రి జీవిత బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్‌లో కుటుంబ సంక్షేమం కోసం రూ.2లక్షల వరకు జీవిత బీమా చేసుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన 2015లో ప్రారంభించారని గుర్తు చేశారు. 18 నుంచి 50 సంవత్సరాల మధ్యలో ఉన్న వ్యక్తులు ఈ పథకాలకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ వినియోగదారుల సేవ కేంద్రం నిర్వాహకులు శివరాజ్‌గౌడ్, రమేష్, శేఖర్, రాజేష్, సాయి, పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

అమెజాన్ కంపెనీ ప్రతినిధులకు వినతి

షాబాద్: నాగర్‌కుంట గ్రామానికి చెందిన అఖీల్ సాగర్ చెరువును, ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయాలని కోరుతూ అమెజాన్ వెబ్‌సర్వీస్ (ఏడబ్ల్యుయస్) సంస్థ ప్రతినిధులకు నాగర్‌కుంట గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెజాన్ వెబ్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని చెరువులు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ముఖ్యంగా నాగర్‌కుంట గ్రామంలో అఖీల్‌సాగర్‌ను అభివృద్ధి చేసి, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు, వాటర్ ఫిల్టర్, గ్రంథాలయ ఏర్పాటునకు సహకరించాలని వారు కోరారు. అలాగే గ్రామస్తులు అఖీల్‌సాగర్‌లో చేపపిల్లలను వదిలారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బర్క శివకుమార్, గ్రామస్తులు యాదయ్య, ఆనందం, నర్సింహులు, రవి, రమేష్, జంగయ్య, చంద్రబాబు, బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.



అమెజాన్ సంస్థ ప్రతినిధులకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు



అఖీల్‌సాగర్ చెరువులో చేప పిల్లలు వదులుతున్న గ్రామస్తులు

బీజేపీతోనే దేశ ప్రగతి



సభ్యత్వాలను నమోదు చేయిస్తున్న రవిగౌడ్ తదితరులు

తలకొండపల్లి: బీజేపీతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవిగౌడ్ అన్నారు. మండల పరిధి చీపునుంతల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి సభ్యత్వం నమోదు చేయించారు. అనంతరం రవి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ.. సభ్యత్వ నమోదును విస్తృతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ అభివృద్ధి, సిద్ధాంతాల కోసం పాటుపడే వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీమోర్చా మండల అధ్యక్షుడు మల్లేశ్, పరమేష్, రమేష్, చంద్రమౌళి, రాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.